సీరియల్

వి.యస్.రావ్

అన్వేషణ

(గత సంచిక తరువాయి)

బిగుసుకున్న హనుమాన్ మొహం ఆటోమాటిక్‌గా విప్పారింది. అతని పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. అతని చూపుల్లో మార్పొచ్చింది. సింహం మొహం చేటలా అయ్యింది. హనుమాన్ ఉత్సాహంతో టీని కప్పుల్లోకి వొంపాడు. విరూపాక్షరావు ముందు ఒక కప్పు వుంచి, మనోజ్‌కి స్వహస్తాల్తో అందించాడు.

"థాంక్స్, హనుమాన్. నో అఫెన్స్!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

హనుమాన్ పళ్ళు యికిలించాడు. "మన మధ్య ఏమీ జరగలేదే!" అన్నాడు ఉషారుగా. విరూపాక్షరావు గొల్లున నవ్వాడు.

టీ చప్పరిస్తూ మనోజ్ హనుమాన్ వైపు చూశాడు.

మూతిమీద బూటుకాలితో తన్ని, బిస్కెట్ పడేసిన యజమానిని ప్రేమతో చూస్తున్న అల్సేషియన్ కళ్ళలా వున్నాయి హాయిమాన్ కళ్ళు.

"సింహం...." అంటూ విరూపాక్షరావు చెయ్యి చాచాడు. సింహం జేబులోంచి తీసి, కవర్ని అతనికి అందించాడు. విరూపాక్షరావు కవర్ని మనోజ్ వైపు తోశాడు.

"మనోజ్, అందులో నా ముగ్గురు అనుచరుల మూడు రకాల ఫోటోలున్నాయి. వాటిని బాగా గుర్తుంచుకుంటే వాళ్ళని నువ్వు సులువుగా పోల్చుకోగలవు...." అన్నాడతను.

టీ కప్పుని కింద పెట్టి మనోజ్ కవర్లోంచి అరడజను ఫోటోల్ని ఇవతలికి లాగాడు. ఒక్కొక్క వ్యక్తివి రెండేసి ఫోటోలు. ఒక ఫోటోలో గడ్డం లేకుండా, మరో ఫోటోలో అంగుళం పొడవు గడ్డంతో వున్న మొహాల్ని మనోజ్ తదేకంగా చూస్తూ వుండిపోయాడు. విరూపాక్షరావు అనుచరులు అమాయకుల్లా అవుపిస్తూన్నారు....

"శత్రువుల చేతుల్లో చిక్కినవాళ్ళు ప్రస్తుతం యే షేప్‌లో వుంటారో మనకి తెలీదు. అందుకే పెరిగిన గడ్డాలతో, చెరిగిన క్రాపుల్తో వున్న ఫోటోలు కూడా నీకు చూపించబడుతున్నాయి!" విరూపాక్షరావు కంఠం మనోజ్‌ని హెచ్చరించింది.

ఆరు ఫోటోల్నీ మూడు వరసలుగా పెట్టి, మనోజ్ తలెత్తి అతన్ని చూశాడు. "వాళ్ళ పేర్లు చెప్పలేదు...."

విరూపాక్షరావు సాభిప్రాయంగా సింహంవేపు చూశాడు.

"ధర్మరాజు, విభీషణ్, భరత్...." సింహం చకచకా అన్నాడు మూడు ఫోటోల్ని వరసగా వేలితో కొట్టుతూ.

మనోజ్ చిరునవ్వు నవ్వుతూ విరూపాక్షరావుని చూశాడు. "పేర్లకి తగ్గట్టే మీ అనుచరులు. అమాయకుల్లా అవుపిస్తున్నారు!"

విరూపాక్షరావు తల ఆవేశంతో కిందికీ పైకీ ఆడింది. "అమాయకులు కాబట్టే వాళ్ళు అపాయంలో చిక్కుకున్నారు!" అన్నాడతను నిట్టూరుస్తూ.

మనోజ్ తన ముందున్న ఫోటోల్ని మరోసారి చూసి, వాట్ని పేకముక్కల్లా కలిపాడు. అన్నింటినీ కవర్‌లో దోపాడు.

"మిస్టర్ విరూపాక్షరావ్, నాకు కొన్ని పరికరాలు కావాలి...."

విరూపాక్షరావు సగర్వంగా నవ్వాడు. "రెండు రోజుల్లో నీ హోటల్ ముందు పవర్‌ఫుల్ ఇంజన్ వున్న అంబాసిడర్ వుంటుంది. "మనోరంజన్, ఫీల్డు ఆఫీసర్, విరూవ్ ఇంటర్నేషనల్" పేరుతో డ్రైవింగ్ లైసెన్సు నీకు అందుతుంది. అన్నట్టు ఇవ్వాళే నువ్వు హోటల్ విక్రమ్‌కి మారిపో. మనోరంజన్ పేరుతో నీ కోసం గది తయారుగా వుంటుంది. హోటల్ మేనేజర్ భుజగోవిందం నువ్వు కొండమీది కోతిని అడిగితే తెచ్చిపెడతాడు. ఎంజాయ్!"

"అంతేకాదు........ సైలెన్సరున్న రివాల్వర్, తూటాలూ...." మనోజ్ అడ్డు తగిలాడు.

"సింహం......." విరూపాక్షరావు గంభీరంగా అన్నాడు.

"రాత్రికి మనోజ్ గార్ని హోటల్ గదిలో కల్సుకుంటాను, బాస్ ..." సింహం వెంటనే అన్నాడు.

ఇంకా యేం కావాలన్నట్టు మనోజ్ ని చూశాయి విరూపాక్షరావు కళ్ళు.

"నా కత్తి ..." మనోజ్ నవ్వుతూ అన్నాడు. విరూపాక్షరావు నవ్వుతూ తనముందు, టేబుల్ మీదున్న కత్తిని మనోజ్ వైపు చాచాడు.

"తప్పించాక మీ శిష్యుల్ని యేం చేయాలి?" మనోజ్ కత్తిని చేత్తో పట్టుకుని ప్రశ్నించాడు.

"పంజరంలోంచి తప్పించాక వాళ్ళని వదిలెయ్. పావురాళ్ళు గూటికి చేరుకున్నట్టు వాళ్ళిక్కడికి చేరుకుంటారు!" విరూపాక్షరావు నవ్వుతూ అన్నాడు.

మనోజ్ లేచి నిలబడ్డాడు. కత్తిని జేబులో పడేసుకుని ఫోటోలున్న కవర్ని అందుకున్నాడు.

"మనోజ్, ఆ ఫోటోల్ని ఇక్కడే వదిలేయ్!"

మనోజ్ విరూపాక్షరావుని ప్రశ్నార్థకంగా కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

"అవి నీ దగ్గరుండటం ప్రమాదం. పొరపాటుగా యెవరేనా చూస్తే నీ ప్రయత్నం వాళ్ళకి తెలిసిపోవచ్చు ..." విరూపాక్షరావు చిరునవ్వుతో వివరించాడు.

"యూ ఆర్ రైట్!" మనోజ్ నవ్వుతూ కవర్ని పడేశాడు.

"మిమ్మల్ని కలుసుకోవాలంటే యెట్లా?" మనోజ్ ప్రశ్నించాడు.

విరూపాక్షరావు మెల్లిగా లేచి ఠీవిగా నిలబడ్డాడు.

"పని పూర్తయ్యాకా నువ్వు నన్ను కలుసుకునే అవ

పరం రాము. అంతవరకూ నువ్వు నన్ను గురించి మరిచిపోవడం మంచిది. నాతో యేదేనా మాట్లాడాల్సిన అవసరం వస్తే హోటల్ మేనేజర్ భజగోవిందాన్ని కలుసుకో. నీకో బుల్ డాగ్ కావాలని అతనితో చెప్పు. అరగంటలో సింహం నిన్ను కలుసుకుంటాడు!"

మనోజ్ తలాడించాడు. నిదానించి విరూపాక్షరావు మొహంలోకి చూశాడు. "మిస్టర్ విరూపాక్షరావ్, నాకో సందేహం వుంది తీరుస్తారా?"

"వాట్!" విరూపాక్షరావు నవ్వుతూ అన్నాడు.

"నేను ఢిల్లీనుంచి తిరిగొచ్చినట్టు మీకెలా తెలుసుకున్నారు?"

విరూపాక్షరావు నోరారా నవ్వుతూ వుండిపోయాడు. "మిస్టర్ మనోజ్, ఢిల్లీలో కూడా నా కళ్ళున్నాయి. యిక్కడే కూచుని నేను ఇండియా అంతా చూడగలను!"

మనోజ్ కనుబొమలు పైకి లేచాయి. విరూపాక్షరావు మళ్ళీ నవ్వాడు. "ఢిల్లీలో నువ్వు అడుగుపెట్టిన క్షణం నుంచీ నా నౌఖరొకడు నిన్ను గమనిస్తూ వుండిపోయాడు. నువ్వు ట్రెయినెక్కగానే నాకు ఫోన్ చేశాడు!" అన్నాడతను సగర్వంగా.

మనోజ్ నవ్వుతూ చూశాడు. "వెళ్తాను. ఇవ్వాల్టి నుంచీ మీ పనిమీదే వుంటాను...."

"నా పనికాదు; నీ పని. నీ పనికోసం నా పని చేస్తున్నావ్!" విరూపాక్షరావు మనోజ్ కళ్ళల్లోకి తదేకంగా చూస్తూ అన్నాడు.

నవ్వుతూ మనోజ్ కదిలాడు.

"మనోజ్...."

మనోజ్ ఆగి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఈ క్షణం నుంచీ నువ్వు అతిజాగ్రత్తగా వుండాలి. నీ నీడను కూడా నువ్వు నమ్మకూడదు! అన్నట్టు సింహం నీకు పైకం అందజేస్తాడు; యెన్నో అవసరా లుంటాయి. వందరూపాయల్ని నువ్వు పైసాలా ఖర్చు చెయ్యొచ్చు! వెళ్ళిరా. గుడ్ లక్!" విరూపాక్షరావు చెయ్యి చాచాడు. మనోజ్ అతని చేతిని పట్టుకున్నాడు.

"ఎక్కడికి వెళ్తున్నావో చూడకుండా నువ్విక్కడికి చేరుకున్నావు. ఎక్కడినుంచీ వెళ్తున్నావో చూడకుండా యిక్కణ్నుంచీ వెళ్ళాలి. ఆ ప్రయత్నంలో వీళ్ళిద్దరితో సహకరించు!" అనుచరులిద్దర్నీ చూపుతూ విరూపాక్షరావు అన్నాడు.

"ఎందుకు....?" మనోజ్ ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

విరూపాక్షరావు తీక్షణంగా చూశాడు. "నీ కోసం ముందు చూపులో చెప్తున్నా. అనుమానించకుండా వెళ్ళు!"

మనోజ్ భుజాలు ఎగరేశాడు. నవ్వుతూ తన దగ్గరగా నిలుచున్న హనుమాన్, సింహం—యిద్దర్నీ చూశాడు. హనుమాన్ చెయ్యి పాంటు జేబులోంచీ యివతలికి వచ్చింది. చేతిలో నల్లటి సంచీ వుంది....

* * *

మనోజ్ హోటల్ విక్రమ్‌లోని గదిలో అద్దం ముందు నిలబడ్డాడు. ఫుల్ సూటులో వున్న ప్రతిబింబాన్ని చిరునవ్వుతో చూశాడు!

రెడీ మేడ్ సూట్ తనకి బాగా సూటయ్యింది. విరూప్ ఇంటర్నేషనల్ ఫీల్డాఫీసర్ హోదాకి తగ్గట్టు, విరూపాక్ష

రావు సప్లై చేసిన పైకంతో నక్కుటి మాట్లు కొన్నం దుకు ఆనందిస్తూ అతను సోఫావైపు నడిచాడు.

రెండురోజుల పరిశీలన తనకి యెన్నో విషయాలు తెలియజేసింది. ఆర్మీలో వుండిపోయిన తనకి విరూపాక్ష రావు గురించి దాదాపు యేమీ తెలీదు. కానీ, సిటీలో అతన్ని గురించి తెలియనివాడు లేడు.

అతనంటే గొప్ప అభిప్రాయం వున్నవాళ్ళున్నట్టే, అతన్ని కాలాంతకుడు అనేవాళ్ళూ వున్నారు. కేవలం మంచి పేరుతోనే వ్యక్తులు పెద్దవాళ్ళు కారు! విరూపాక్షరావుకి చాలామంది మిత్రులున్నారు; నలుగురైదుగురు దాదాపు సమఉజ్జీలు కాగలిగిన శత్రువులూ వున్నారు. వాళ్ళల్లో జంబుకేశ్వరం ప్రథముడు.

ఎన్నో హోటల్నూ, క్లబ్బులూ నడుపుతూ చట్టం కళ్ళు కప్పుతూ లక్షలు ఆర్జిస్తున్న విరూపాక్షరావును అధిగమించడానికి జంబుకేశ్వరం నిర్విరామంగా ప్రయత్నిస్తున్నట్టు మనోజ్ తన పరిశోధన ద్వారా తెలుసుకున్నాడు.

వివిధ 'కుంభకోణాల్ని', 'గాసిప్స్'ని ప్రముఖంగా ప్రచురిస్తూ సర్క్యులేషన్ పెంచుకున్న దినపత్రిక "పాలికేక" జంబుకేశ్వరం అల్లుడిదని తను తెలుసుకోగలిగాడు. తన పరువు గంగపాలవుతుందని అందుకే విరూపాక్షరావు హడిలిపోతున్నాడు! అతని అనుచరులు నోరు తెరిస్తే అతని కథ పాలికేకలో తాటికాయంత అక్షరాల్తో ప్రచురించబడుతుంది!

కాలుస్తున్న సిగరెట్‌ని యాష్‌ట్రేలో పడేసి మనోజ్ టైం చూసుకున్నాడు. పదకొండు దాటింది. తను పారో

గంటలో బయల్దేరాలి.

మనోజ్ లోపలి గదిలోకి వెళ్ళాడు. సూటు తీసేసి, డార్క్ కలర్ పాంటూ, ఫుల్ స్వెటర్ వేసుకున్నాడు.

తను సిద్ధంగా వుంచుకున్న పరికరాల్ని చిరునవ్వుతో చూశాడు. అక్కడ యేవి తనకి అవసరమవుతాయో తెలీదు. అన్నీ పట్టుకెళ్ళడం మంచిది. రెండురోజుల క్రితం సింహం సప్లై చేసిన సైలెన్సరున్న రివాల్వర్ని పాంటుజేబులో పడేసుకున్నాడు. తన కత్తిని అండర్ వేర్ కీ, పాంటుకీ మధ్య వుండేలా తగిలించాడు. స్క్రూ డ్రైవర్నీ, స్కెలిటన్ కీని జేబులో దాచుకున్నాడు. తనకి అవసరమనిపించినవాటిని తీసుకోడం మరిచిపోలేదని రూఢి చేసుకుని, గదిలోంచి బైటికి నడిచాడు. తాళం వేసి, మెట్లవైపు అడుగులేశాడు. రిసెప్షన్ గుండా వెళితే అందరూ తనని చూస్తారు....

అయిదునిమిషాల తరవాత, మనోజ్ కారుని మెయిన్ రోడ్ మీదికి తిప్పాడు. మరో అయిదునిమిషాల తరువాత సర్కిల్ లో ఎడమవైపు తిరిగి కారుని నెమ్మదిగా తన గమ్యస్థానంవైపు పోనిచ్చాడు. విశ్రాంతి లేకుండా పరిశోధించి, తను యెక్కడికి వెళ్ళాలో ఆ రోజు సాయంత్రానికల్లా తను తెలిసుకోగలిగాడు.

జంబుకేశ్వరానికి డజనుకుపైగా బిల్డింగ్స్ వున్నాయి. విరూపాక్షరావు శిష్యుల్ని అతను యెక్కడేనా దాచి వుండొచ్చు. హౌసింగ్ బోర్డు ఆఫీసులో అనుమానం రాకుండా సాగించిన ఎన్క్వయిరీ మూలంగా ఆ బిల్డింగుల వివరాల్ని తను సంపాయించగలిగాడు. ఏ పనీ లేని నిరు

ద్యోగిలా తిరుగుతూ ఆ భవంతుల్ని తను ప్రదక్షిణాలు చేశాడు.

సిటీకి దూరంగా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ లో వేర్ హౌస్ గా జంబుకేశ్వరం బాట్లింగ్ కంపెనీ ఉపయోగించే ఒక బిల్డింగ్ మనోజ్ దృష్టిని ఆకర్షించింది. అక్కడ వాళ్ళని దాచివుంచే అవకాశం బాగా కనిపించడానికి. విరూపాక్షరావు యిచ్చిన సమాచారం కూడా ఆ బిల్డింగ్ మీదే అనుమానం పుట్టించింది.

మనోజ్ కారుని సడెన్ బ్రేక్ తో ఆపాడు. కుడివైపు నుంచి దూసుకొస్తున్న లారీ వెళ్ళిపోయింది.

రిస్టువాచీ చూశాడతను. పన్నెండు కావొస్తోంది. మరో ఇరవై నిమిషాల్లో తను అక్కడుంటాడు.

మనోజ్ పాదం బ్రేక్ పెడల్ మీంచి పైకి జరిగింది. కారు కదిలింది.

తను ఏం చేయాల్సిందీ మరోసారి జాగ్రత్తగా బుర్రలో రిహార్స్ చేసుకుంటూ మనోజ్ కారుని సిటీ లిమిట్స్ దాటి పోనిచ్చాడు. రోడ్డుమీద ట్రాఫిక్ పూర్తిగా లేదు.

ఇరవై నిమిషాల తరువాత తను తిరగాల్సిన రోడ్డు చీలికను దాటి వేగంగా కారుని పోనిచ్చాడు మనోజ్. కిలోమీటర్ తరువాత రోడ్డు పల్లంలోకి ఏటవాలుగా దిగుతోంది

మనోజ్ కారుని స్లో చేసి, పూర్తిగా రోడ్డు అంచుకి పోనిచ్చి, కారుని వెనక్కి తిప్పాడు. హెడ్ లైట్స్ ఆర్పేసి, తను వచ్చిన రోడ్డుమ్మటే మెల్లిగా పోనిచ్చాడు. కాసేపట్లో తను దాటి వెళ్ళిన మలుపు సమీపించాడు.

కారుని రోడ్డువారగా ఆపి, కిందికి దిగాడు.

బోనెట్‌ని పైకెత్తి వుంచేశాడు. రోడ్డుపక్కనే పడివున్న రాళ్ళని ఏరి, రోడ్డుమీద కారుపక్కగా వరుసగా వుంచాడు. టైర్లకింద రాళ్ళు పెట్టలేదతను. ఎవరేనా చూస్తే కారు ట్రబులిచ్చి ఆగిపోయిందనుకుంటారు....

జేబులోంచి తీసి, కత్తిని స్వెట్టర్ వెనకభాగంలో తను స్వయంగా కుట్టుకున్న హుక్‌లో, లోపలివైపు వుండేలా తగిలించాడు. జాగ్రత్తగా లాగితేగానీ కత్తి రాదు.

తనకి కావాల్సిన భవనం రెండు ఫర్లాంగులదూరంలో నీడలా కనిపిస్తోంది.

మనోజ్ చీకట్లోకి చీలిపోతున్న రోడ్డుమీద చకచకా నడవసాగేడు. రోడ్డు తనని భవనం ముందుభాగానికి తీసుకెళ్తుంది. తను వెనకవైపుకి వెళ్ళాలి. మనోజ్ రోడ్డు వదిలేసి, బీడు ప్రదేశంమీద అడ్డంపడి నడవసాగేడు....

పదినిమిషాల్లో అతను శేక్‌హసాన్‌ని సమీపించాడు. ముందుభాగంలో లైటు వెలుగుతోంది. అక్కడ ఇరవైనాలుగ్గంటలూ ఆర్మ్‌డ్ గార్డు కాపలా వుంటాడని అతనికి తెలుసు. రాజమార్గంగుండా తను లోపలికి వెళ్ళలేడు! వెనక, దొడ్డిదారి లేదు. తను వెళ్ళాల్సిన, వెళ్ళగలిగిన మార్గం ఒక్కటే. మూడు అంతస్థులున్న భవనం పైకి చేరుకోవాలి. అక్కణ్నుంచీ లోపలికి దిగాలి.... వెతకాలి....

మనోజ్ భవనం వెనకభాగంలో ఆగాడు. మిజోరంలో తను చేసిన డ్యూటీని గుర్తు చేసుకుంటూ బోర్లాపడుకున్నాడు. తలని పక్కకి తిప్పి, చెవిని నేలమీద ఆనించాడు. పచ్చగడ్డి అతని చెంపని తాకుతోంది. చెవిని ఆనించి ఏకాగ్రతతో వింటే భూమి దూరంలో పుట్టే

శబ్దాల్ని చేరవేస్తుంది.

అయిదు నిమిషాలపాటు మనోజ్ కదలకుండా వుండిపోయాడు. అనుమానం పుట్టించే శబ్దాలేవీ అతని చెవికి అందడంలేదు. తృప్తిగా తల కొంచెం పైకెత్తి, ముందుకి చూశాడు. ఇంతసేపూ మూసుకున్న కళ్ళు చీకటికి బాగా అలవాటు పడ్డాయి.

బిల్డింగ్ గోడని అంటిపెట్టుకున్న గొట్టం నల్లటి, పొడుగాటి గీతలా అవుపిస్తోంది. మనోజ్ కొండచిలువలా ముందుకి కదిలాడు. ముళ్ళతీగల కంచె కిందనుంచి, లోపలికి జాగ్రత్తగా తన శరీరాన్ని సరఫరా చేశాడు. కాసేపు పడుకునే వుండిపోయి, అటూ ఇటూ చూశాడు. మెల్లిగా లేచి భవనంవేపు వేగంగా నడవసాగేడు. రబ్బర్ సోల్స్ వున్న బూట్లు శబ్దం చేయవని అతనికి తెలుసు. వీపుని గొట్టందగ్గరగా గోడకి ఆనించి, తలతిప్పి భవనం రెండు మూలలా చూశాడు. ఎవరూ రావడంలేదు.

మనోజ్ కదిలాడు. రెండు చేతుల్తో గొట్టాన్ని పట్టుకున్నాడు. గుండ్రటి పోల్ని పట్టుకుని పైకి ఎగబాకే టెలిఫోన్ లైన్మన్లా చకచకా పైకి ఎగబాకడం ప్రారంభించాడు. జోరుగా వీస్తున్న చల్లటి గాలిని వెక్కిరిస్తూ అతని శరీరంమీద చెమట కమ్ముకొంది. చేతులు నొప్పెడుతున్నాయి. పదడుగుల దూరంలో, బిల్డింగ్ అంచుమీంచీ ఆకారం అతనికి కనిపిస్తోంది. మనోజ్ ఉడుములా గొట్టాన్ని కరుచుకుని పాకుతూ వుండిపోయాడు.

సలుపుతున్న చేతులవేళ్ళు అతన్ని త్వరగా డాబామీదికి చేరుకొమ్మని హెచ్చరిస్తున్నాయి. పట్టుదలతో మనోజ్ పైకి జరుగుతున్నాడు. మరో అయిదు నిమిషాల తర్వాత

కుడిచేతి వేళ్ళు భవనం పిట్టగోడమీద ఆనుకున్నాయి. తనకి తెలియకుండానే అతను నిట్టూర్చాడు. డాబామీదికి గెంతేయాలన్న ఆతృతని కంట్రోల్ చేసుకుంటూ మనోజ్ ఎడమ చేతిని పిట్టగోడమీదికి ఆన్చాడు. మెల్లిగా తల పైకెత్తి, కళ్ళు గోడ లెవల్లో వుండేలా ఆగాడు.

మరుక్షణం మనోజ్ కిందికి జారాడు. అతని ఎడమ చెయ్యి ఆవేశంతో గొట్టాన్ని పట్టుకుంది.

* * *

డాబామీద, మెట్లవైపున్న తలుపుముందు ఇద్దరు వ్యక్తులు కాపలా కాస్తున్నారు. వాళ్ళ చేతుల్లో వున్న తుపాకుల్ని చీకట్లో కూడా మనోజ్ పోల్చుకోగలిగాడు.

డాబామీద కాపలా వుంటుందని తను ఊహించలేదు! అకారణంగా, యిలాంటి కాపలా యేర్పాటు చేయబడదు! మనోజ్ గొట్టానికి బల్లిలా కరుచుకుని, ఆలోచిస్తూ చెవులు రిక్కించాడు. కాపలా వ్యక్తుల్లో ఒకతను దగ్గుతున్న శబ్దం వినిపించిందతనికి. బూట్ల చప్పుడు.

మనోజ్ మళ్ళీ పైకి కదిలాడు. తలని పిట్టగోడపైకి చాపాడు. కాపలావాళ్ళిద్దరూ తగ్గుస్వరంలో యేదో మాట్లాడుకొంటున్నారు. ఒకతను ఆగకుండా అటూ యిటూ తిరుగుతున్నాడు. నైట్ డ్యూటీ చేసే సెంట్రీలు అలా యెందుకు తిరుగుతారో మనోజ్ కి తెలుసు. నిద్రని దూరంగా వుంచటానికి అతను అలా తిరుగుతున్నాడు. తను గోడమీదికి యెక్కితే, ఆకాశం బ్యాక్ గ్రౌండ్ లో వాళ్ళకి స్పష్టంగా కనిపించే ప్రమాదం వుంది. ఏం చేయాలి?

పచార్లు చేస్తున్న వ్యక్తి తన అనుచరుడి ముందు ఆగాడు తుపాకీని భుజానికి వేళ్ళాడేసి, చెవిలోంచి ఏదో ఊదాడు. క్షణకాలం తరువాత యిద్దరి తలలూ దగ్గరగా వంగాయి. యెందుకి వంగాయో మనోజ్ కి తెలుసు!

అతను కటూలున, చేతుల బలంతో తన శరీరాన్ని పిట్టగోడమీదికి చేర వేశాడు. మరుక్షణం మనోజ్ శరీరం పిట్టగోడ వారగా, డాబామీదికి జారింది. మోకాళ్ళ మీదా, చేతులమీదా ఆనుకొని ముందుకు లంఘించడానికి తయారుగా వున్న చిరుతపులిలా క్షణకాలం ఆగాడతను. అతని కళ్ళు కాపలావాళ్ళవైపు చూస్తున్నాయి.

వాళ్ళ తలల మధ్య వెలిగిన అగ్గిపుల్ల ఆరిపోయింది, తలలు రెండూ దూరంగా జరిగాయి. మిణుగురు పురుగుల్లా వెలుగుతున్న సిగరెట్ కొసల్ని చూస్తూ మనోజ్ డాబా మీద పడుకున్నాడు.

అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. మనోజ్ నిశ్శబ్దంగా వొగురుతూ, పాములా జరిగాడు. ఎడమవైపున ఎత్తుగా నిలుచున్న వాటర్ టాంక్ అతని దృష్టిని ఆకర్షిస్తూ, తన చోటుకు రమ్మని అతన్ని ఆహ్వానిస్తోంది. ఆలస్యం చేయకుండా మనోజ్ అటువైపు పాకడం ప్రారంభించాడు. కాసేపట్లో వాటర్ టాంక్ వున్న చోటుకి చేరుకున్నాడు. టాంక్ పాదవునా అలాగే పడుకొని, కాసేపు విశ్రాంతి తీసుకుంటూ వుండిపోయాడు. కానీ, అతని మెదడు విశ్రాంతి తీసుకోడంలేదు ...

వేగంగా ఆలోచిస్తూ మనోజ్ వెల్లకిలా తిరిగాడు. వాటర్ టాంక్ పక్కగా, తనపైగా ఆకాశానికి గీసిన గీతల్లా కరెంట్ వైర్లు సాగిపోతున్నాయి. మనోజ్ లేచి

కూచున్నాడు. అటూ ఇటూ చూశాడు. టాంక్ పక్కగా గోడవైపున కుప్పగా పడున్న చెత్తా చెదారం అతని దృష్టిని ఆకర్షించాయి. ఏదో ప్లాను అతని బుర్రలో శరవేగంతో రూపొందుతోంది. కదలబోతూ మనోజ్ చెవులు రిక్కించాడు.

కాపలావాళ్ళు నవ్వుతూ యేదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు. మనోజ్ మెల్లిగా చెత్తకుప్ప వైపు జరిగాడు. చిన్నచిన్న డీల్‌వుడ్ బాక్సులూ, కొయ్యపలకలూ, వగైరా లీలగా అవుపిస్తున్నాయి. ఆశగా, నిశ్శబ్దంగా మనోజ్ చేతులు ఆ గుట్టలో దేని కోసమో వెతకసాగాయి. పదినిమిషాల్లో అతని శ్రమ ఫలించింది. చుట్టగా చుట్టి గిరాటేయబడిన సన్నటి కమ్మీ అతని చేతికి తగిలింది. కాసేపు తంటాలుపడి, చిందరవందరగా వున్న చెత్తలోంచీ కమ్మీ చుట్టను ఇవతలికి లాగాడతను. దాన్ని తన పక్కనే వుంచుకొని మనోజ్ మళ్ళీ తన చేతులకి పని కల్పించాడు.

మీటర్ బద్దలా పొడుగ్గా వున్న రెండు కొయ్య రీపర్సని ఇవతలికి లాగి, టాంక్ గోడకి ఆనుకుని మనోజ్ తృప్తిగా నిట్టూర్చాడు. ముందే ఎడంగా లాగివుంచిన డీల్‌వుడ్ పలకని, పీటలా తన కిందికి చేర్చుకున్నాడు.

చీకట్లో అతని చెయ్యి ముందుకి సాగింది. వాటర్ టాంక్ క్లీనింగ్ సమయంలో నీటిని పూర్తిగా ఖాళీ చేయడంకోసం అమర్చిన చిన్న గొట్టాన్ని కదిలాడు.

తటాలున నీళ్ళు ఇవతలికి ఉరికాయి. డాబా ఎటు వేపున వాలుగా వుందో తనకి తెలీదు. కాపలావాళ్ళున్న వైపుకి నీళ్ళు ప్రవహించాలని లోపల్లోపల ప్రార్థిస్తూ,

మనోజ్ తన పనిలో రెండో ప్రయత్నం ప్రారంభించాడు.

చుట్టగా వున్న ఇనపవైర్‌ని విప్పి, సాగదీశాడు. రెండు మీటర్లు వుండేలా కొయ్య రీపర్స్ రెండింటినీ జాయింట్ చేసి, పొడుగ్గా వుండేలా మరో వైర్ ముక్కతో కట్టేశాడు. రెండు మీటర్ల పొడవున్న కమ్మీని రీపర్ కొసకి అనించాడు. రీపర్ కమ్మీ మధ్యలో వుండేలా సర్ది, కమ్మీని దానికి గట్టిగా కట్టేశాడు. నిలువు ఆకారంలో తయారైన ఆయుధాన్ని తృప్తిగా చూశాడు. తనకి కావాల్సిన పరికరం తయారైంది. దాన్ని తన దగ్గరగా వుంచుకొని మనోజ్ విశ్రాంతిగా టాంక్‌కి ఆనుకున్నాడు.

నీళ్ళు డాబామీద పరుచుకుంటున్నాయి. టాంక్ నుండీ అటువైపుకి, కాపలావాళ్ళున్నవైపుకి నీళ్ళు మెల్లిగా పాకుతున్నాయి!

ప్రవహిస్తున్న నీళ్ళు కాపలావ్యక్తుల కాళ్ళకిందికి చేరుకున్నట్టు తెలుసుకోడానికి తను ప్రత్యేకంగా ప్రయత్నించనక్కర్లేదని మనోజ్‌కి తెలుసు. వాళ్ళ ఆశ్చర్యం, వాళ్ళ కంఠాలు—తనకి ఆ సంగతిని తెలియజేస్తాయి. అతను కాలాన్నీ, స్థలాన్నీ మరిచిపోయాడు. తను కూచున్న కొయ్యపలకమీదికి మరో రెండు పలకలు ఎక్కించాడు, మెల్లిగా. 'నీళ్ళు తన కాళ్ళకి తగలకూడదు.

మనోజ్ ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంతో కాపలా వ్యక్తి పెట్టిన సన్నటి కేక అతనికి వినిపించింది. నీళ్ళు వాళ్ళకిందికి పాకాయన్నమాట! మనోజ్ ఆవేశంతో కదిలాడు. తను ఇంక క్షణకాలంకూడా ఆలస్యం చేయ

కూడదు!

అతని కుడిచెయ్యి మెరుపులా కదిలింది. రీపర్లకి బిగించిన కమ్మీ ఏటవాలుగా పైకిలేచింది. హై వోల్టేజి ఎలెక్ట్రిసిటీని మోసుకెళ్తున్న వైర్ని కమ్మీ కొస తటాలున తాకింది. మరోకొస డాబామీద ప్రవహించిన నీళ్ళని తాకింది. అప్రయత్నంగా మనోజ్ కళ్ళు మూసుకున్నాడు.

'ఫట్'మంటూ చప్పుడైంది. ఏదో మెరుపులా మెరిసింది. మనోజ్ చెయ్యి కదిలింది. మరేదో శబ్దం అతని చెవుల్ని తాకింది. తుపాకులు కిందపడుతూ చేసిన శబ్దం! మనోజ్ రీపర్ని వదిలేశాడు. నిర్భయంగా ముందుకి గెంతాడు. కాపలావాళ్ళున్న వైపుకి జోరుగా నడిచాడు. రెండు ఆకారాలు కుప్పలుగా పడున్నాయి. కాళ్ళకింద కొయ్యపలకలు లేకపోతే, తనుకూడా వాళ్ళలాగా నిర్జీవంగా పడుండేవాడే!

నిమిషంలో మనోజ్ వాళ్ళిద్దర్నీ లాక్కెళ్ళి వాటర్ టాంక్‌లో పడేశాడు. నీళ్ళ ప్రవాహాన్ని ఆపేశాడు. రెండు తుపాకుల్నీ టాంక్ గోడకి ఆనాడు ఆవేశంతో రొప్పుతూ తలుపుముందు నిలబడ్డాడు. వణుకుతున్న చేత్తో గొళ్ళెం తడిమాడు. తాళం వేయలేదు! గొళ్ళాన్నిలాగి, తలుపుని తోశాడు. శబ్దం కాకుండా తలుపు తెరుచుకుంది.

వెలుతురు సన్నగా మెట్లకిందినుంచీ కనిపిస్తోంది. తన అడ్వెంచర్ మూలంగా కరెంట్ ఎందుకు పోలేదా అని ఆలోచిస్తూ, మనోజ్ రెండు మెట్లు దిగాడు. తలుపుని ముందుకు తోసి, మెట్లు దిగసాగేడు.

చివరి మెట్టుమీద మనోజ్ తటాలున ఆగి, గోడ

వారంగా జారిగాడు. ఏదో చప్పుడు అతని చెవుల్ని తాకు తోంది. సన్నటి మూతివున్న బిందె నీళ్ళల్లో మునుగుతూ చేసే చప్పుడు.

తలని ముందుకు చాచి చప్పుడు వస్తున్న వైపు చూశాడు మనోజ్. కప్పునుంచి వేళ్ళాడుతున్న 40 వాట్ల బల్బు కాంతిలో రెండు బూట్లు అతనికి కనిపించాయి. మడమలమీద ఏటవాలుగా నిలబడ్డ బూట్లు. పాదాల ఆధారంతో అలా వున్నాయని అతను గ్రహించాడు.

మనోజ్ తల మరికొంచెం ముందుకి సాగింది. నలిగి పోయిన పాంటులో దూరిన రెండు కాళ్ళు, బార్లా సాగి కనిపిస్తున్నాయి. గార్డు విశ్రాంతిగా కూచుని నిద్రపో తున్నాడు. తన చెవుల్ని తాకుతోన్న శబ్దం అతని గురక అని మనోజ్ కి క్షణంలో అర్థమైంది. మనోజ్ అటూ ఇటూ చూశాడు. పెద్ద హాలు. ఖాళీగా వుంది. కిటికీలూ, వెంటిలేటర్లూ మూయబడ్డాయి. అతడు పిల్లిలా కదిలాడు.

సన్నటి నడవ ముందు, స్టూలుమీద కూచుని గార్డు నిద్రపోతున్నాడు. అతనిలాగే, అతని తుపాకీ కూడా గోడకి జార్లాబడివుంది. మనోజ్ గాలిలో అడుగు లేస్తున్నట్టు కదిలి అతని పక్కగా, గోడవార ఆగాడు. గార్డు తల కిందికి వాలింది. గెడ్డం ఛాతీమీద ఆనింది. అంగుళం పొడవున్న గెడ్డంమీద, గురక పెడ్తూ అతను కార్చుతున్న చొంగ తెల్లగా మెరుస్తోంది.

మనోజ్ రివాల్వర్ని ఎడమచేతిలోకి మార్చుకు న్నాడు. అతని కుడిచెయ్యి మెల్లిగా ముందుకుసాగింది.

చూపుడు వేలూ, నడిమి వేలూ గార్డు చెవికింద ఆగాయి. ఏ నరాన్ని ఎంత ఒత్తిడితో నొక్కాలో, ఆర్మీ అతడికి నేర్పింది. అతని చేతికండరాలు కదిలాయి. వేళ్ళు గార్డు చెవికింది నరాన్ని బలంగా నొక్కాయి. అతని తల కొద్దిగా కదిలింది. గురక ఆగిపోయింది.

గార్డు మరో అరగంటదాకా లేవడు. లేచాక, తనకి ఏం జరిగిందో వూహించలేడు! మనోజ్ నవ్వుకుంటూ నడవమ్మట అడుగులు వేయసాగాడు.

హాల్లోని లైటు నడవలో సగందాకా వెల్తుర్ని సరఫరా చేస్తోంది. తరవాత చీకటి. ఈ నడవగుండా తనెక్కడికి వెళ్ళాలి? ముందు కూచోన్న గార్డు దేనికో, యెవరికో కాపలా కాస్తున్నాడు! నడవ చివరికి వచ్చే సరికి మనోజ్ సందేహం తీరింది. మలుపుతిరిగిన నడవ చివర తలుపుముందు మరో గార్డు కూచున్నాడు. మొదటి గార్డులాగా అతను నిద్రపోవడంలేదు! అతని నోట్లో వెలుగుతున్న సిగరెట్ మనోజ్ కి ఎర్రగా అవుపించింది. అతను తటాలున గోడచాటుకి తప్పుకున్నాడు.

గార్డు మెలకువగా వున్నాడు. తనిప్పుడేం చేయాలి? సావధానంగా ఆలోచించే అవకాశంలేదు. రెండో గార్డు కూచున్నచోట లైటు లేకపోవడం తనకి కొంత వుపయోగిస్తుంది. సైలెన్సర్ వున్న రివాల్వర్ తో క్షణంలో అతన్ని శవంగా మార్చొచ్చు. ఇప్పటికే తను ఇద్దర్ని ఎలెక్ట్రోక్యూట్ చేశాడు! మనుషుల్ని చంపడం, అందులో అజాగ్రత్తగా వున్న వాళ్ళని చాటునుండీ చంపడం యెందుకో అయిష్టంగా అనిపిస్తోందతనికి.

అతను తన రాకని పసిగట్టేలాగా పదడుగులు వెళ్ళ

కలిగితే చాలు; తను అతన్ని సమీపించగలడు. రెప్పపాటులో అతని నోరు నొక్కగలడు, తాత్కాలికంగా. మనోజ్ కొంచెం ముందుకి జరిగాడు. గార్డు సిగరెట్ ని పొడుగ్గా లాగాడు. మనోజ్ నవ్వుకున్నాడు. ఆఖరి దమ్ము. మెరుపులా కదలడానికి మడమల్ని పైకెత్తి సిద్ధంగా వున్నాడు మనోజ్.

మనోజ్ మెరుపులా కదిలాడు. గార్డు కిందికి వొంగి సిగరెట్ పీకని నేలమీద నొక్కుతున్నాడు. నాలు గంగల్లో మనోజ్ అతన్ని సమీపించాడు.

మెత్తటి శబ్దం గార్డుని ఆకర్షించింది. అతని తల చివాల్న పక్కకి తిరిగింది. గోడకి ఆనివున్న గన్ వైపు అతని చెయ్యి దూసుకెళ్ళింది. వేళ్ళు గన్ ని పట్టుకునేలోగా మనోజ్ చేతిలోని రివాల్వర్ కొన అతని కణతను తాకింది.

"చెయ్యి తీసెయ్! కదలకు!" మనోజ్ తగ్గుస్వరంలో హెచ్చరించాడు. గార్డుకి రివాల్వర్స్ తో మంచి పరిచయం వున్నట్టుంది. అతని చెయ్యి గన్ నుండి దూరంగా జరిగింది.

"చేతులెత్తు!" మనోజ్ ఆజ్ఞాపించాడు. గార్డు చేతులు పైకి లేచేలోగా, అతని చెయ్యి కదిలింది. చెవి కింది నరం మనోజ్ వేలికింద నలుగుతోంది. ఒకవైపు కణతమీద రివాల్వర్, మరోవైపు బలమైన మనోజ్ చెయ్యీ గార్డు తలని కదలకుండా చేశాయి. గార్డు చేతులు తోటకూర కాడల్లా కిందికి వాలాయి.

మనోజ్ అతని తలని గోడకి ఆనించాడు. చకచకా అతని జేబులు వెతికాడు. పాంటు జేబులో దాగిన తాళంచెవిని తీసుకున్నాడు. నడవ మూలలో వున్న తలుపు తాళం తెరిచాడు. చిక్కటి చీకటి అతనికి

స్పష్టంగా చెప్తోంది.

మనోజ్ అడుగు ముందుకి వేశాడు. అతని బూటు అరడుగు కిందికి దిగింది. మెట్లు! గోడతడుముతూ, అతడు మెల్లిగా మెట్లు దిగసాగేడు. పది మెట్ల తరవాత, సమతలంగా వున్న నేల అతని కాళ్ళకి తగిలింది. జేబులోంచి పెన్ టార్చి తీశాడతను. టార్చిని తన శరీరానికి దూరంగా వుంచి స్విచ్చి నొక్కాడు. అదేక్షణంలో అతని కుడి చేతివేలు రివాల్వర్ సేఫ్టీ కాచ్‌ను రిలీజ్ చేసింది. మనోజ్ గుండె వేగంగా కొట్టుకుంటోంది. పెన్ టార్చి ఇంకా వెలుగుతూనే వుంది. ఏ రివాల్వర్ పేలలేదు. అంటే, గదిలో గార్డులు లేరన్నమాట!

మనోజ్ ధైర్యంగా టార్చికాంతిని గదిలో ఫోకస్ చేస్తూ చూడసాగేడు. కుడివైపు గోడమీద కాంతి ఆగింది. అరడుగుల ఎత్తులోంచి రెండు ఎర్రటి కళ్ళు నెత్తురుబొట్లలా అతనివేపు చూస్తున్నాయి. ఆ ఎర్రదనంలో ఏదో భయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పొట్టిగా, గుబురుగా పెరిగిన గడ్డం. మనోజ్ తృప్తితో అతన్ని పోల్చుకున్నాడు. ధర్మరాజు!

"ధర్మరాజా!" టార్చిని అలాగే వుంచుకుని అతని దగ్గరగా నడుస్తూ మెల్లగా పిలిచాడు, మనోజ్. ధర్మరాజా మాట్లాడలేదు. కానీ ఆశ్చర్యం అతని కంఠంలో రొప్పులాగా ధ్వనించింది.

మనోజ్ టార్చిని తలుపువైపు తిప్పాడు. గోడకి స్విచ్ వుంది. గబగబా వెళ్ళి అతను స్విచ్చిని కిందికి నొక్కాడు. 40 వాట్ల బల్బు వెలిగింది. అతను ధర్మరాజుని పరిశీలనగా చూశాడు.

(సశేషం)